క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని పెదమామిడిపల్లి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మాఘ షష్టి పురస్కరించుకుని మంగళవారం శాంతి కల్యాణం నిర్వహించారు. గణపతి పూజ, రుద్రహోమం, సూర్యనమస్కారాలు, హోమాలు చేశారు. అర్చకులు చేబ్రోలు బాలకృష్ణ గాంధీ, శ్రీనివాస రామమూర్తి, చేబ్రోలు కృష్ణమోహన్ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భక్తాంజనేయస్వామికి పూజలు



భక్తాంజనేయస్వామి

యలమంచిలి: మాఘ శుద్ధ సప్తమి సందర్భంగా స్థానిక మంచి నీటి చెరువు గట్టున ఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వాడపల్లి మురళీ కృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఆంజనేయస్వామికి వట్టి వేరు, బంతి, చామంతి పువ్వులతో పుష్పాభిషేకం, తమలపాకులు, గంగ సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జూదరుల అరెస్ట్

ఉండి: మండలంలోని మహదేవపట్నంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2100 నగదు, రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


పేకాట శిబిరంపై దాడి

ఆకివీడు: స్థానిక శ్రీరామపురంలో మంగళవారం పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2700 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరుస్తున్నామన్నారు.

బర్డ్ ఫ్లూతో చిరు వ్యాపారులు కుదేలు

ఆకివీడు: బర్డ్‌ఫ్లూతో కోళ్ల అమ్మకాలు నిలుపుదల చేయడంతో రోడ్ల వెంబడి ఉండే చికెన్ సెంటర్లు, పలావ్ బళ్లు, చికెన్ ఫ్రై వంటి పలు రకాల చికెన్ వంటకాలను అమ్మే చిరు వ్యాపారులు ఉపాధిని కోల్పోయి కుదేలవుతున్నారు. చికెన్ షాపులు మూతపడటంతో చికెన్ అమ్మేవారు ఉపాధిని కోల్పోయామని, చికెన్ అమ్మకాలతోనే తమ జీవనం గడుస్తుందని వారు వాపోతున్నారు. మూడు నెలలు అమ్మకాలను నిలుపుదల చేయడంతో తాము దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఆసరాగా ఉండాలని పలువురు వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

టెక్నాలజీని వినియోగించుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులు టెక్నాలజీని వినియోగించుకోవాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజులు తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు ×ప్రజ్వలన 2కె25₹ పేరిట జరిగిన హేక్తాన్ పోటీల్లో మొదటి స్థానం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్సీ విద్యార్థులు సాధించి రూ.20వేల నగదు బహుమతి అందుకున్నారు. హేక్తాన్ పోటీలు ముగింపు సందర్భంగా మంగళవారం సెమినార్ హాల్లో బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ బి హెచ్ వి ఎస్ రామకృష్ణంరాజు, డాక్టర్ జి శిరీష, డాక్టర్ కృష్ణంరాజు, కోఆర్డినేటర్ డి హేమలత మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు హర్యానా వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి విద్యార్థులు హేక్తాన్ లో పాల్గొనడం జరిగిందని వివరించారు. ఎస్ఆర్‌కెఆర్‌లో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయటం వలన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని విజేతలైన పలువురు విద్యార్థులు పేర్కొన్నారు.

అభివృద్ధికి ఆటంకాలు



సిద్ధాంతం శ్మశాన వాటికలో పునాది స్థాయిలో నిలిచిన నిర్మాణం



మట్టి గుట్టలు, చెత్తా చెదారాలతో నిండిపోయిన శ్మశాన వాటిక

- సిద్ధాంతం శ్మశాన వాటికలో అవస్థలు
- జగన్ హయాంలో పనులు
- టీడీపీ హయాంలో నిర్లక్ష్యం

పెనుగొండ: సిద్ధాంతం వశిష్టా గోదావరి తీరంలో కేదారేశ్వరుడు కొలువై ఉండడంతో ఇక్కడి కేదారీ ఘాట్ దక్షిణ కాశీగా పేర్గాంచింది. ఈ ఘాట్ అభివృద్ధి 20 ఏళ్లుగా కల గానే మిగిలిపోయింది. సిద్ధాంతం శ్మశాన వాటికకు పెనుగొండ, పెనుమంత్ర, ఆచంట, తణుకు, అత్తిలి, ఇరగవరం, పెరవలి మండలాల నుంచి మృతదేహాలను అంత్యక్రియల నిర్వహణకు తీసుకొస్తుంటారు. ఇక్కడ దహన సంస్కారాలకు అనుగుణమైన సదుపాయాలు లేక మృతుల బంధువులు నానా అవస్థలు పడుతున్నారు.

కరోనాతో ఆటంకం

సిద్ధాంతం శ్మశాన వాటిక అభివృద్ధి పనులు తొలిసారిగా 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో నాటి మంత్రి పితాని సత్యనారాయణ రూ.40 లక్షలతో ప్రారంభించారు. ఆ పనులు పునాది స్థాయికే పరిమితమయ్యాయి. అనంతరం టీడీపీ హయాం 2014 నుంచి 2019 వరకు ఈ పనులను పట్టించుకున్న నాథుడు లేడు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో నాటి మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు శ్మశాన వాటిక అభివృద్ధి పనులను తిరిగి పట్టాలెక్కించారు. కరోనా వైరస్ కారణంగా పనులు నిలిచిపోయాయి.

ఫలించని ప్రయత్నాలు

2022లో ప్రభుత్వ నిధులు, స్థానిక దాతల భాగస్వామ్యంతో శ్మశాన వాటికను రాజమండ్రికి కైలాస వనంకు దీటుగా తీర్చిదిద్దాలని ప్రయత్నాలు చేశారు. స్థానికులతో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కొంత మేర సొంత నిధులు సమకూర్చి, ప్రభుత్వ నిధులతో కలిపి 2023లో పనులు ప్రారంభించారు. 2024లో ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. అయితే పనులను తిరిగి పట్టాలెక్కించేందుకు ఇటీవల రెండు, మూడు సమావేశాలు నిర్వహించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా సిద్ధాంతం శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల హామీ నెరవేరేనా?



సిద్ధాంతం శ్మశాన వాటిక అభివృద్ధి ఎన్నికల హామీగానే నిలిచిపోతుంది. నాలుగు పర్యాయాలుగా ప్రతి సారి ఎన్నికల్లో శ్మశాన వాటిక అభివృద్ధికి హామీ ఇస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు మంజూరులో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

– ఎస్ వెంకటేశ్వరరావు, పెనుగొండ

ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి



సిద్ధాంతం శ్మశాన వాటికను అభివృద్ధి చేసి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి. ఆచంట నియోజకవర్గంతో పాటు, తణుకు, పెరవలి నియోజకవర్గ ప్రజలు సైతం ఈ శ్మశాన వాటికను వినియోగించుకొంటున్నారు. నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేపట్టాలి.

– పి.రామిరెడ్డి (రాజా), నెగ్గిపూడి

నేడు మండల పరిషత్ సమావేశం

పోడూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.మంగాకుమారి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

డ్రెయిన్లను నిత్యం శుభ్రం చేయాలి



3వ వార్డులో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: పట్టణంలోని అన్ని వార్డుల్లో డ్రెయిన్స్‌ను ప్రతిరోజూ శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య ఆదేశించారు. మంగళవారం ఆయన 3వ వార్డులో డ్రెయిన్లను పరిశీలించారు. దోమలు పెరగకుండా డ్రెయిన్స్‌ను శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట శానిటేషన్ అధికారులు కిషోర్, త్రిమూర్తులు ఉన్నారు.

చిన్నారుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ వీరాస్వామి

పాలకొల్లు అర్బన్: చిన్నారుల సమగ్ర అభివృద్ధికి దోహద పడే అంశాలను బోధించాలని ఎంఈఓ గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. స్థానిక ఎంఎంకేఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎఫ్ఎల్ఎన్ జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీడీపీఓ సీహెచ్ ఇందిర అధ్యక్షతన ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌పీ డి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం ద్వారా భవిష్యత్తులో అన్ని రంగాలల్లో విద్యార్థుల ఉన్నతికి ఉపయోగపడే అంశాలతో చిన్నారులను తీర్చిదిద్దాలని అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. జిల్లా కోఆర్డినేటర్ రమణకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పులఖండం సత్యవేణి, ఎస్ పద్మావతి, హెచ్ఎం నాని, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పథకాలకు విశిష్ట సంఖ్య తప్పనిసరి



పెనుగొండలో యూనిక్ ఐడీ నమోదును పర్యవేక్షిస్తున్న జడ్ వెంకటేశ్వరరావు

పెనుగొండ: ప్రతి రైతూ యూనిక్ ఐడీ కోసం వివరాలు నమోదు చేసుకోవడం తప్పనిసరని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పెనుగొండ రైతు సేవాకేంద్రాల్లో రైతు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందడానికి 11 అంకెలతో కూడిన యూనిక్ ఐడీ తప్పనిసరని అన్నారు. మండల వ్యవసాయాధికారి పి.స్పందన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 3330 మంది రైతుల నమోదు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. మిగిలిన రైతులు త్వరితగతిన నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ ప్రియదర్శిని, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే పనులను వేగవంతం చేయాలి

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ

నరసాపురం రూరల్: భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మొగల్తూరు మండలం కేపీ పాలెం గ్రామంలో రీ సర్వే పనులను ఆయన పరిశీలించారు. రైతుల భూములకు ఖచ్చితమైన హద్దులు గుర్తించి రికార్డులను ఆధునీకరించేందుకు ప్రయోగాత్మకంగా ఈ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్వే నిర్వహించే ముందు భూ యజమానులకు తెలియజేయాలని అన్నారు. రైతుల అభ్యంతరాలను ప్రామాణికంగా తీసుకుని సరిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో జేసీ మాట్లాడారు. జేసీ వెంట ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ రాజా కిషోర్, సర్వేయర్లు కుమార్, ధనరాజు, రీ సర్వే డీటీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



యువకుడిని పరామర్శిస్తున్న నాయకులు

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు పెరిగాయని మాలల ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు, దళితనాయకుడు కాకిలేటి మధు అన్నారు. ఇటీవల మొగల్తూరు మండలం బండారు పేటకు చెందిన మైలాబత్తుల పవన్‌ను సీతారామపురం గ్రామంలోని అగ్రకులానికి చెందిన మాదాసు పవన్, పులపర్తి కళ్యాణ్, కేసరి ప్రసాద్, అడబాల మణికంఠ మరికొందరు దాడి చేసి గాయపర్చారని, కులంపేరుతో దూషించారని తెలిపారు. మంగళవారం బాధితుడు పవన్ నివాసానికి వెళ్లి మధు ధైర్యం చెప్పారు. దోషులపై కేసులు నమోదు చేయాలన్నారు. లేకుంటే మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. మర్దనపు సుధాకర్, వర్దనపు విజయ్, దాసరి రాజు, బండారు వీరేష్, పెనుమాల మహేష్, ప్రభాకర్, బడారు సురేష్ తదితర దళితన నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం, విద్యా సామగ్రి వితరణ



పౌష్టికాహారం, విద్యా సామగ్రి అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: స్థానిక శ్రీరామ్‌పేట భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు కేర్ ట్రస్ట్ (భీమవరం) విరాళంతో పౌష్టికాహారం, విద్యాసామగ్రి మంగళవారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు గంటా కిరణ్‌బాబు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు సేవ, సంరక్షణ వంటి సేవా కార్యక్రమాలు చేయాలన్న లక్ష్యంతో 2007లో ట్రస్ట్‌ను స్థాపించామన్నారు. 30 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.500 విలువైన బ్యాగ్, 200 గ్రాముల బూస్ట్ సీసా, అర కిలో కందిపప్పు, అరకిలో పంచదార, కలర్ పెన్సిళ్లు, బిస్కెట్లు, కేక్‌లు అందజేశామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఐఈఆర్‌టీ వీటి శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు సాగర్‌బాబు, కల్యాణ్‌బాబు, ఉదయ్‌కుమార్, ఐఈఆర్‌ఈ జి.గాయత్రి, సుబ్బలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల రాష్ట్ర సంఘం డైరీని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, అసోసియేట్ అధ్యక్షుడు జకరయ్య, డివిజన్ నాయకులు కేవీ సత్యనారాయణ, ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటు సమస్యకు మోక్షం



చినమామిడిపల్లి వద్ద నిర్మించిన బైపాస్ రోడ్డు

నరసాపురం: స్థానిక రైల్వే స్టేషన్‌ను ఆనుకుని చిన మామడిపల్లిలో బైపాస్ రోడ్డు నిర్మాణంతో సుమారు 40 గ్రామాల ప్రజల కష్టాలు తీరాయి. చినమామిడిపల్లిలో రైల్వేగేటు రైళ్ల రద్దీ, ఇంజిన్ల షంటింగ్ కారణంగా పగటిపూట కూడా సుమారు 3 గంటల పాటు మూసేసేవారు. అయితే రైల్వేశాఖ స్టేషన్‌ను ఆనుకుని ఉన్న స్థలంలో బైపాస్‌రోడ్డు నిర్మించి, గేట్‌ను శాశ్వతంగా మూసేశారు. దీంతో రైల్వేగేట్ సమస్యకు మోక్షం కలిగింది. మత్స్యపురి మీదుగా నరసాపురం నుంచి భీమవరం వెళ్లే ట్రాఫిక్ ఈ రోడ్డులో విపరీతంగా పెరిగింది. రైల్వే గేట్ సమస్య లేకపోవడంతో సుమారు 40 గ్రామాల వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇటుగా ప్రయాణిస్తున్నారు. దశాబ్దాల రైల్వేగేట్ సమస్య తీరడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా ఉండాలి



పోడూరులో రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న తహసీల్దార్

పోడూరు: రేషన్ పంపిణీ సక్రమంగా ఉండాలని తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ఆదేశించారు. పోడూరులో 9వ నెంబరు రేషన్ దుకాణాన్ని, ఎండీయూ 11ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి దీపం–2 పథకం లబ్ధిదారులతో మాట్లాడారు. ఎల్‌పీజీ సిలెండర్లు సక్రమంగా అందుతున్నాయా? సబ్సిడీ నగదు బ్యాంకు అక్కౌంటులో జమ అదుతుందా? లేదా? అని ఆరా తీశారు. తహసీల్దార్ వెంట సీఎస్ డీటీ నాగదేవి, ఆర్ఐ కె.రాంబాబు, వీఆర్‌ఓలు చలం, వర్మ తదితరులున్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డులు సాధించిన వారిని అభినందిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: అవార్డులు, తెలుగు తేజం జాతీయ పురస్కారాలను అందుకున్న స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన డాక్టర్ వి.స్వామినాథన్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ విస్సా మాణిక్యాలరావులను మంగళవారం స్థానిక కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఇటీవల రాజమండ్రిలో పిలాంత్రోఫిక్ ఆధ్వర్యంలో జరిగిన గోదావరి ఉత్సవ్ 2025 విభిన్న రంగాల్లోని తెలుగు తేజాలకు పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. డాక్టర్ అద్దంకి రాజా ప్రముఖ సామాజిక వేత్త చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో స్వామినాథన్, మాణిక్యాలరావులు పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ మార్పిడి స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజు, తహసీల్దార్

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామానికి చెందిన ఆకి మురళీ శ్రీనివాస్‌కు ఆర్యపేటలో ఉన్న ఎకరా ఆరు సెంట్ల స్థలాన్ని భూ మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ భూమి మంగళవారం ఆర్డీఓ దాసి రాజు సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ గ్రంథి నాగ వెంకట పవన్‌కుమార్, ఆర్ఐ కవురు యశోద, వీఆర్వో గోటేటి లక్ష్మీ నరసింహరావు (బుజ్జి) ఉన్నారు.

దళితవాడల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నన్నేటి పుష్పరాజ్

భీమవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలలు గడుస్తున్న దళితవాడలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి అభివృద్ధికి తోడ్పడాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఈ సందర్భంగా పుష్పరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితవాడలో అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు 100% పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటి సుందర్ కుమార్, నేతల సువర్ణరాజు, చిల్లి రాజ్ కుమార్, కొలాటి ప్రసాదరావు, చిగురుపాటి రాజేష్, నేతల సాల్మన్ రాజు, పిట్టా వినోద్ కుమార్, దాసరి చిరంజీవి, నన్నేటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జనగణనతో పాటు కులగణన చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

భీమవరం: రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన నిర్వహించి వెనుక బడిన, అణగారిన కులాల జనాభా ప్రాతిపదికన ఆయా కులాల అభివృద్ధికి సంక్షేమానికి నిధులు, రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం చేకూర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ జిల్లా సమితి సమావేశం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కోనాల భీమారావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలపై కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తామన్న హామీ నెరవేర్చాలని కోరుతూ సీపీఐ చేపట్టిన ఇళ్ల స్థలాలు అర్జీలు నింపే కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహించి మార్చి 15న జిల్లా కలెక్టర్‌కు ఇళ్ళ స్థలాల అర్జీలు అందజేస్తామన్నారు. ఇళ్ల స్థలాల సమస్య తీవ్రంగా ఉందని త్వరితంగా పేదల ఇళ్ల స్థలాలు సమస్య పరిష్కరించాలని కోనాల కోరారు. మార్చి 23న భగత్ సింగ్ వర్ధంతి నుంచి ఏప్రియల్ 14న అంబేడ్కర్ జయంతి వరకు రాజ్యాంగం, లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు, సామాజిక న్యాయం కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలపై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా పేదల పక్షాన పోరాడాలని, అప్పట్లో నిర్మించిన టిడ్కో ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వీటి పంపిణీపై పేదల తరపున నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, బొద్దాని నాగరాజు, నెక్కంటి క్రాంతి కుమార్, సికిలే పుష్పకుమారి, నెక్కంటి జగదాంబ, సనపల శ్రీనివాసరావు, మల్లుల శ్రీనివాసరావు, కోన గొల్లయ్య, నామన వెంకటేశ్వరరావు, వైవీ ఆనంద్, జోషి, తిరుమాని కామేశ్వరరావు, ఎం.లక్ష్మిపతి, బొద్దాని కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.

ప్రకృతి రక్షణకు గుడ్డ సంచులు మేలు



భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్లో గుడ్డ సంచులను పంచుతున్న దృశ్యం

భీమవరం: ప్లాస్టిక్ కవర్లు వద్దు, గుడ్డ సంచులే ముద్దు అని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్‌ని నివారించాలని రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, భీమవరం మున్సిపల్ ఇంజనీర్ త్రినాథ్ అన్నారు. భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్‌లో పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నివారించపోతే మానవమనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. ఇంటినుంచి బయ టకు వచ్చేటప్పుడు కచ్చితంగా గుడ్డసంచి వెంట తెచ్చుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ప్రకృతి రక్షణకు గుడ్డ సంచులు మేలని, ప్రతిఒక్కరు ఒక్క మొక్కనైనా నాటాలన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం గన్నాబత్తుల శ్రీనివాస్ సహకారంతో 300 మంది ప్రయాణికులకు ఉచితంగా గుడ్డ సంచులను అందజేశారు.